క్లుప్తంగా

నేడు ముద్దల పండుగ

కమలాపురం : పట్టణంతో పాటు మండలంలోని కోగటం, సంబటూరు, పందిళ్లపల్లె, పెద్ద చెప్పలి, చిన్నచెప్పలి తదితర గ్రామాల్లో ఆదివారం ముద్దల పండుగ చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పట్టణంలోని గంగమ్మ ఆలయం వద్ద భక్తులు తమ కోర్కెలు తీర్చు కోవడానికి, మొక్కులు చెల్లించుకోవడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తెల్లవారు జామున నుంచే భక్తులు గంగమ్మకు పూజలు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

చిన్నదండ్లూరు దేవరకు భారీ బందోబస్తు



చిన్నదండ్లూరులో పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ సుదర్శన్‌ప్రసాద్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన చిన్నదండ్లూరులో ఆదివారం పెద్దమ్మ దేవర జరగనుంది. కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాద్, కలమల్ల ఎస్ఐ శివప్రసాద్‌ల అధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నేడు గంగమ్మ జాతర

చెన్నూరు : స్థానిక బస్టాండ్ సమీపంలోని గంగమ్మతల్లి ప్రతిమ వద్ద ఆదివారం గంగమ్మజాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామునుంచే జాతర ప్రారంభమవుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు రక్తదాన శిబిరం

కమలాపురం : పట్టణంలోని శ్రీలక్ష్మీ దుర్గ డ్రైవింగ్ స్కూల్ వద్ద సోమవారం అభయ ఫౌండేషన్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందని, విద్యార్థులు, ఉద్యోగులు, యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయవచ్చని ఆయన అన్నారు. భోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ వారి పర్యవేక్షణలో ఈ శిబిరం కొనసాగు తుందన్నారు.

24న బహిరంగ వేలం పాట

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపాలిటీకి సంబంధించి బహిరంగ దినసరి మార్కెట్ వేలం పాటను ఈనెల 24వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. జగన్నాథ్ శనివారం తన కార్యాయలంలో వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు రూ.5 లక్షలు డిపాజిట్‌తో పాటు రూ.2 వేలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం పాట ఉంటుందన్నారు. వేలంలో దినసారి మార్కెట్ దక్కించుకున్న వారు మున్సిపల్ నిబంధనల మేరకే గేటు రాబట్టుకోవాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

చింతకొమ్మదిన్నె : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయంలో శనివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీకే దిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులురెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ

చెన్నూరు : స్థానిక లక్ష్మిప్రసన్న వెంకటేశ్వర స్వామి (కోట్లస్వామి) దేవస్థానానికి సంబంధించిన భూమిలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయం సమీపంలో దేవస్థానానికి సంబంధించిన భూమిలో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

కుక్కలనుంచి కాపాడండి



గుంపులుగా ఉన్న కుక్కలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని గాంధీనగర్, ఫైర్‌స్టేషన్ సమీపంలో కుక్కలు గుంపులు గుంపులుగా ఉన్నాయని వాటినుంచి రక్షణ కల్పించండని కాలనీ వాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయని, అలాగే పట్టణంలోని పలు ప్రాంతాలలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళుతున్న వారిని వెంట పడుతున్నాయి. రాష్ట్రంలో పలు జిల్లాలలో కుక్కలు చిన్నపిల్లలపై దాడి చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాంటివి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆస్తి పన్ను రూ.1.68 కోట్లు వసూళ్లు

- ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ పథకం వర్తింపు
- మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్



ఎర్రగుంట్లలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, ఆర్ఓ గంగిరెడ్డిలు



పులివెందులలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు రూ.1.68 కోట్లు ఆస్తి పన్ను వసూళ్లు అయిందని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పన్ను వసూళ్లపై ఆర్ఓ గంగిరెడ్డితో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పన్ను బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబరు 34 ద్వారా ఈనెల 31వ తేదీలోగా ఆస్తి పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీలో సంవత్సరానికి రూ.2.24 కోట్లు కాగ ఇప్పటి వరకు రూ.1.68 కోట్లు వసూళ్లు జరిగిందన్నారు. మిగిలిన రూ.58 లక్షలు ఈనెల 31 తేదీలోగా వసూళ్లు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయ భవనాల పన్నులు చాలా పెండింగ్ ఉందని, అందులో విద్యుత్‌శాఖకు సంబంధించి ఆస్తి పన్ను లక్షల్లో ఉందన్నారు. ఆర్ఓ గంగిరెడ్డి ప్రత్యేక చొరవ చూపి పాత బకాయిలను వసూళ్లు చేస్తున్నారని తెలిపారు.

ఆస్తి పన్ను, ఖాళీ జాగాల పన్నుపై వడ్డీ మాఫీ – మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను, ఖాళీ జాగాల పన్నులపై ఉన్న వడ్డీని వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం ప్రవేశపెట్టిందని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎవరైనా గత ఏడాది, ప్రస్తుత ఏడాది బకాయిలు ఉన్న పన్నుదారులు ఒకేసారి చెల్లిస్తారో వారందరికీ వారి ఇంటిపై ఉన్న వడ్డీ మొత్తం రద్దు చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. అంతకమునుపు జెఎన్‌టీయూ వెనుకవైపున జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల పురోగతిపై ప్రతిరోజు తనకు తెలియజేయాలని అమెనిటీ సెక్రటరీలకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

రాయల్టీని మినహాయించాలని వినతి



మంత్రి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ఎం.సుధీర్‌రెడ్డి, పెద్దారెడ్డిలు

ఎర్రగుంట్ల : నాపరాయి పరిశ్రమలపై వసూళ్లు చేస్తున్న రాయల్టీని పూర్తిగా మినహాయించాలని కోరుతూ విజయవాడలో మంత్రి రామచంద్రారెడ్డిని ఎర్రగుంట్ల నాపరాయి యజమానులు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిల ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రగుంట్ల మండల పరిధిలోని నాపరాయి పరిశ్రమ, పాలీస్ మిషన్‌లపై వేలాది మంది కార్మికులు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని చెప్పారు. అందుకే ట్రాక్టర్ల ద్వారా వస్తున్న గొడరాళ్లకు పూర్తిగా రాయల్టీని రద్దు చేయాలని కోరారు. అలాగే గని, పాలిష్‌మిషన్‌లపై రాయల్టీ వసూళ్లపై పూర్తిగా మినహాయింపు విధించాలని కోరారు. దీనిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందించి నాపరాయి పరిశ్రమలపై సాధ్యమైనంత వరకూ రాయల్టీని మినహాయింపు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. అలాగే డీజీఎం వెంకటరెడ్డిని కూడా కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమ అసోసియేషన్ సభ్యులు, యజమనులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ గుండె జబ్బు నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి. నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99631 70177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



పశు పోషకులకు ఎముకల పొడిని అందిస్తున్న పశువైద్య సిబ్బంది

సింహాద్రిపురం : మండల పరిధిలోని కసనూరులో శనివారం సింహాద్రిపురం, బిదినంచర్ల పశువైద్యులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పశువులు రోగాలబారినపడకుండా పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం వారు పశు పోషకులకు ఎముకల పొడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు శివప్రసాద్, మహమ్మద్ యూనఫ్, ఏహెచ్‌ఏలు వసంతలక్ష్మి, మౌనిక, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి హుండీ వితరణ



హుండీని ఆలయ ఈఓకు అందజేస్తున్న దాతలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయా నికి పులివెందుల మండలం పెద్దరంగాపురం గ్రామానికి చెందిన దాతలు వెన్నపూస గంగిరెడ్డి, రామసుబ్బమ్మ దంపతులు రూ.35 వేలు విలువ చేసే హుండీని వితరణగా శనివారం ఆలయంలో ఈఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డికి అందజేశారు.

నవ ధాన్యాల సాగుతో నేల సారవంతం



సాగుపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం, ఏఓ

వేంపల్లె : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవ ధాన్యాల సాగు చేయడంవల్ల ఆరోగ్యవంతమైన పంటను ఉత్పత్తి చేయడంతోపాటు నేలను సారవంతం చేయవచ్చునని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నవ ధాన్యాల సాగుపై ఏఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఏడాది పొడవునా నేలలో పలు రకాల పంటలను సాగు చేయడం ద్వారా భూసారం తగ్గిపోతుందన్నారు. అదే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 45 రోజులపాటు 30 రకాల నవ ధాన్యాలను ఎకరాకు 12 కిలోల చొప్పున సాగు చేస్తే నేల సారవంతంగా ఉంటుందన్నారు. అడిషనల్ డీపీఎం వసంతరకుమారి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమిలో సూక్ష్మ జీవులు, వాన పాములు అభివృద్ధి చెందుతాయని.. తద్వారా జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. అలాగే భూసారం పెరుగుతుందని, పశువుల మేతవల్ల పాల దిగుబడితో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బలస్వామి, ఏపీసీఎన్‌ఎఫ్ బాబు, సిబ్బంది, వీఏఏ, వీహెచ్ఏ, వీఓఏ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలి



శనగల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, తదితరులు

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ శనగలు కొనుగోలు చేస్తోందని, ఈ కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా శనగలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యసాయాధికారి నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డిలు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన వ్యవసాయ మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన అకస్మీకంగా తనిఖీ చేసి మాట్లాడారు. శనగలు కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వస్తే కోర్టును ఆశ్రయించండి



వంటలను పరిశీలిస్తున్న జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

జమ్మలమడుగు రూరల్ : హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ఏమైన సమస్యలు వస్తే కోర్టును ఆశ్రయించి న్యాయం పొందాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, నాగులకట్ట రామిరెడ్డిపల్లె రహదారిలో నున్న మహాత్మాజ్యోతి బాపూలే హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. హాస్టళ్లలో ఉంటు చదువుకుంటున్న విద్యార్థులను ప్రభు త్వ నియమ నిబంధనల మేరకు వారిని చూసుకోవాలని ఆయన వార్డన్లకు సూచించారు. అనంతరం చేసిన వంటలను, బాత్ రూంలను ఆయన పరిశీలించారు.

టీకాలు తప్పనిసరిగా వేయండి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి డాక్టర్ శశిభూషన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, చిలంకూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న వలసపల్లి, క్రాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను, చిలంకూరులోని ఎస్సీ కాలనీ, నాల్గవ వార్డు, నిడుజివ్వి గ్రామాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా ప్రోగ్రాం మానటిరింగ్ అధికారి డాక్టర్ శశిభూషన్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. 0–2 సంవత్సరాల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయాలని, అలాగే వ్యాక్సిన్‌ను గర్భిణులకు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేసి ఎంసీపీ కార్డులో ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుచరిత, జ్యోత్స్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి



నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : విద్యార్థులు చిన్నప్పటినుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని శ్రీరామకృష్ణపురంలోని స్వామి వివేకానంద ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో సైన్స్‌ఫేర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీఎస్ రామాంజనేయరెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మలమడుగు రూరల్ : తెలుగు క్యా లెండర్‌ను శనివారం డీఎస్పీ నాగరా జు ఆయన కార్యాలయంలో త్రైత సి ద్ధాంత కమిటీ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల నూతన కార్యవర్గం ఎంపిక

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండల జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ కార్యాలయంలో గౌరవ సలహాదారులు రాజు అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. నరసింహారెడ్డి, సెక్రటరీ రాగిమాను బాషా, ట్రెజరర్ నాగరాజు, ఉపాధ్యక్షులుగా హాజీ మహమ్మద్, చిన్నికృష్ణ, ప్రవీణ్ తదితరులను ఎన్నుకున్నారు.

సేవా దృక్పథం అలవరుచుకోవాలి



రామాంజికి నగదు అందిస్తున్న వైఎస్సార్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు, తదితరులు

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని వైఎస్సార్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాబకాష్ అన్నారు. 20 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామాంజి కుటుంబానికి వైఎస్సార్ ఫొటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం రూ.20,500ల ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా అల్లాబకాష్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ కుటుంబంలో ఎవరికి ప్రమాదం జరిగినా వైఎస్సార్ యూనియన్ తరపున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. యూనియన్ సభ్యులు సుధాకర్, ప్రసాద్, దస్తగిరిలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అభినందనలు



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ర్యాంకులు సాధించడంపట్ల డైరెక్టర్ కె.సంధ్యారాణి వారికి అభినందనలు తెలిపారు. ఆల్ ఇండియాస్థాయి గేట్–2023 పరీక్షల్లో విద్యార్థులు తమ సత్తా చాటారని తెలిపారు. అందులో ఎంఎంఈ విభాగంలో ఎ.నవజీవన్‌సాగర్‌కు 7వ ర్యాంక్, కె.లక్ష్మీచంద్రిక 32వ ర్యాంక్ సాధించారు. అలాగే ఎంఎంఈలో 5 మంది, ఈసీఈలో ఇద్దరు, సీఎస్ఈలో ఒకరు 1000లోపు ర్యాంకులు సాధించారు. 5వేల లోపు ర్యాంక్‌లు 11 మంది సాధించారన్నారు. ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఈ3, ఈ4కు చెందిన విద్యార్థులు గేట్–2023 పరీక్షల్లో 34 మంది విద్యార్థులు సాధించడంపట్ల డైరెక్టర్‌తోపాటు ఆయా విభాగపు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ చాన్సలర్ కె.చెంచురెడ్డి, ఇన్‌చార్జి వీసీ విజయకుమార్‌లు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాబోయే రోజులలో ఎక్కువ మందికి ర్యాంక్‌లు వచ్చేలా కృషి చేయాలన్నదే యూనివర్శిటీ లక్ష్యమని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీన్ రత్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం



డ్వాక్రా మహిళకు వైఎస్సార్ రుణమాఫీ పత్రం అందిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది

సింహాద్రిపురం : డ్వాక్రా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం మంజునాథ తెలిపారు. మండల పరిధిలోని పైడిపాలెం గ్రామంలో శనివారం డ్వాక్రా సంఘాలకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా సంఘాలకు పూర్తి రుణమాఫీ మూడవ విడత నిధులను ఈనెల 25వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి అకౌంట్లలో డబ్బులు జమచేస్తారన్నారు. ఇప్పటికే గడప గడపకు వెళ్లి డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది వెళ్లి విన్నవించడం జరిగిందన్నారు. డ్వాక్రా సంఘాలకు జీవనోపాధి కల్పనకు అదనపు రుణ సౌకర్యం కల్పించడానికి సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా 523 సంఘాలకు గానూ దాదాపు రూ.5.24 కోట్లకుపైగా రుణం మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం జరగలేదనడం విడ్డూరం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : టీడీపీలోకి వెళ్లిన 20వ వార్డు కౌన్సిలర్ నీలం ప్రమీల నరేంద్ర వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాపులకు న్యాయం జరగడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు గురై టీడీపీలోకి మారిన నరేంద్ర ఎమ్మెల్యే, పార్టీపై అభాండాలు వేయడం తగదన్నారు. పార్టీలో కాపులకు ఏ మాత్రం విలువ ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర అనే జీరో స్థాయి వ్యక్తిని కౌన్సిలర్ చేసిన ఘనత ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దేనన్నారు. ప్యాకేజ్ మాట్లాడుకుని టీడీపీలోకి వెళ్లిన వ్యక్తి తమ పార్టీపై నిందలు మోపడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫస్ట్ వైస్ చైర్మన్ మహ్మద్‌సాదిక్, మాజీ జట్పీటీసీ మస్తానయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, జిలానీ, జగన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఏపీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్‌కాలనీలోని చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామంలో చల్ల కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు ఆలయంలో జ్యోతుల తయారీని ప్రారంభించారు. తొగట వీరక్షత్రియుల ఆధ్వర్యంలో ఉత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను పూర్తి చేశారు. అలాగే జ్యోతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏపీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డికి ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రేడ్ సాధనకు కృషి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తమ గ్రేడును సాధించేందుకు కష్టపడి చదవాలని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలోని చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను నిర్వహించారు.

